Weekend story

# భూలచ్చుమమ్మ



✓ **కందికొండ**, సినీ గేయ రచయిత

**కాగబారిన** మురికి తుమ్మచెట్టు మొదలసొంటి నల్లటి శరీరం, చెవులని తెంపుకొని కింద పడుతయా ఏంది అన్నట్టుగ చెవులకి యాళ్ళాడే బరువైన బంగారు గంటీలు, ముక్కుకు ఎడమ దిక్కున పావలా బిళ్ళంత ముక్కుపుడక, కుడి దిక్కున సన్నటి బంగారు పోగు, నొసలు మీద ఆటాన బిళ్లంత ఎర్రటి బొట్టు, పసుపు తాడుకు నడుమ ఎనుకటి రూపాయి బిళ్ళంత ఎడల్పున్న పుస్తె, దానికి రొండు దిక్కుల గురువింద గింజలంత బంగారు గుండ్లు, నల్లపూసల గుండ్లు, వీటి మధ్యమధ్యల 'రాంబస్' ఆకారంల వుండే బంగారు బిల్లలతో కుచ్చిన పుస్తెల తాడును మెడలేసుకోని రొండు చేతులకు మోచేతుల మీద వెండి దండకడియాలు, కాళ్లకు కడియాలు, కాలు వేళ్లకు కరెంటు వైరు అంత దొడ్డుండే వెండి మట్టెలు, బొడ్డుకు ఎడమదిక్కున చీరకట్టు లోపలికి సగం చెక్కిన బొడ్డె సంచి, పొడుగు ఎంటికలను శిగ ముడేసి, చేతులకు మట్టి గాజులేసుకోని నడిసచ్చె నల్లపోచమ్మ లెక్కుంటది, జాల్లీ హిల్స్ పెద్దమ్మ తల్లిలెక్కుంటది భూలచ్చుమమ్మ.

భూలచ్చుమమ్మది ఒరంగల్లు హంటర్‌రోడ్డు పక్కన ఐదారు కిలోమీటర్ల దూరంల వుండె ఓ పల్లెటూరు. పద్నాలుగేండ్ల వయసున్నప్పుడే పెండ్లయ్యింది. ఇప్పుడామె ఏం తక్కువ దెబ్బై ఏండ్లదాక వుంటది. భర్త నర్సయ్య కొంచెం అమాయకుడు ఇంటి పెత్తనం అంతా భూలచ్చుమమ్మదె. అమాయకుడని పెనిమిటిని నలుగురిల నాదాన్ జేసి మాట్లాడది, చిన్న సూపు సూడది. ఒకలంటె ఒకలకు పాపురం. వలపడ, దాపడ ఎడ్లలెక్క కలిసిమెలిసి బతుకు బండి ఈడుస్తరు.

భూలచ్చుమమ్మకు తొలిసూరి కానుపు కొడుకు పుట్టిండు. రొండో కానుపు కొడుకే పుట్టిండు. అట్లా ఐదుగురు మొగ సంతానమే అయ్యిండ్లు. అయ్యో రేపు సచ్చిపోతే తలాపుకు కూసోని ఏడువనీకి ఒక్క ఆడపిల్లన్న లేదాయె అని రేణుక ఎల్లమ్మకు మొక్కి యాటపోతును కోస్తే ఆరో సంతానం ఆడపిల్ల పుడుతె రేణుకమ్మ అని పేరు పెట్టుకున్నది.

పిల్లలంటే భూలచ్చుమమ్మకు మస్తు ప్రేమ. ఊళ్ళె ఎవ్వలన్న దేవునికి కొబ్బరికాయ గొట్టి దాన్ని ముక్కలు జేసి ఇంతంత బెల్లం గలిపి పలారం పంచి పెడుతె నాలుగు ముక్కలు ఎక్కువ తీసుకోని చీరె కొంగుకు కట్టుకోని పిల్లలకు తీసుకపోతది.

ఎవ్వలన్న అమ్మలక్కలు అయ్యో చీరె కరాబయితది కాదు భూలచ్చుమక్క అంటే నా పిల్లలకన్న ఎక్కువనా ఈ చీరె అంటది. ఇంటిపెరట్ల జామచెట్టు వున్నోళ్ళు ఓ నాలుగు జామపండ్లు ఇత్తె ఇంకో రొండు ఇయ్యమని మస్తు బతిలాడుతది, బామాడుతది. ఇంక రొండెందుకవ్వా అంటె ఆరుగురు పిలగాండ్లకు తలా ఓటి అంటది. ఊళ్లె బజారుపొంటి పోతాంటె ఎవ్వలన్న అడుగుతరని జాకెట్ల జాంపండ్లను దాసుకోని మీదినుంచెల్లి కొంగు కప్పుకోని పోయి పిల్లలకిస్తది సాటుంగ. నువ్వు ఓ పండు తినరాదు నెర

కథ బతుకమ్మలో ప్రచురితమైన కథకు ₹ 750 పారితోషికం ఉంటుందని గమనించగలరు. - ఎడిటర్

అన్నానం తేత్తవ్ నీకు కడుపు లేదా అంటే పిలగాండ్ల కడుపు నిండుతే నాకు నిండినట్లె అంటది.

భూలచ్చుమమ్మ మీద ఎగబడి బిడ్డ రేణుకమ్మ, కొడుకులు పాలు దీసుతాంటె ఇంటిపక్కోళ్ళు, ఇంటి ఎనకోళ్లు ఇంతంత యాపాకు నూరి రొమ్ములకు పెట్టరాదు. చేదుగొట్టి పాలు మరుత్తరు మేము మా పిలగాండ్లకు అట్లనే పాలు మరిపిచ్చినం అని ఉపాయం చెప్పుతె అవ్వో, నా పోరగాండ్లు ఆకలితోటి అలుమటిత్తరు గాదు అని పిల్లలను రొంబొచ్చెకు గట్టిగ అమురుకుంటది.

భూలచ్చుమమ్మ పిల్లలను పునుక్కున ఊళ్ళె ఎవలన్న కొడుతె చిన్నైనా, పెద్దైనా, ఆడైనా, మగైనా వాళ్లమీదికి పిల్లలకోడిలెక్క గయ్యిన లేస్తది. తిట్టేనే తిట్లు తిట్టకుంట తిట్టి సాపిస్తది. పిల్లలు ఎంత ఇసుక పుట్టించినా పన్నెత్తి మాటనది, చెయ్యెత్తి దెబ్బ కొట్టది. ఓసారి ఊళ్ళెకు టీకాలేసేటోళ్ళు వత్తె ఆరుగురి పిలగాండ్లకు దగ్గరుండి టీకాలేయించింది. అందరికీ టీకా గాయాలు మానినయ్ కని నడిపోడు కోతికి కొబ్బరి శిప్ప దొరికినట్లు టీకా ఏసినకాడ గోకిటాలకు శిన్న పుండులెక్క తయారయితె ఆ టీకా ఏసిన కాంపౌండర్‌ను వాడి శేతులు ఇరిగిపోను, వాడి శేతులకు జెట్టలు పుట్ట అని వారం రోజులు తిట్టింది. ఇనలేక ఊళ్ళోళ్ళు చెవులు మూసుకున్నరు.

రోజు పొద్దున సాయంత్రం ఇద్దరాలుమొగలు కూసోని బువ్వ తింటానపుడు పిల్లలు ఎదుగుతాండ్లు రేపు ఆడిపిల్ల పెండ్లి జెయ్యాలె. పెట్టుపోతలుంటయ్. మొగపోరగాండ్లకు పెండ్లిజేత్తె వచ్చిన కోడండ్లు ఏం సంపాయించిండ్లు? అని ఎత్తిపొడుపు మాటలంటరు. మనకు మన పెద్దోళ్ళు రెండెకరాల భూమి ఇచ్చిండ్లు. మనం మన పిలగాండ్లకు తలా నాలుగు ఎకరాలు ఇయ్యకపోతె ఎట్లా? అని పెనిమిటి నర్సయ్య దగ్గర రంది ఎల్లబోసుకునేది భూలచ్చుమమ్మ. సరేలే ఏదన్నా ఆలోచన చేద్దాం అని ఆ ముచ్చటే మర్చిపోయెటోడు నర్సయ్య.

భూలచ్చుమమ్మకు ఊళ్ళె కలిగిన కుటుంబాలతోని మంచి మాటె వుండేది. పెనిమిటికి ఎన్నిసార్ల జెప్పినా చెవుమీద పేను పారుతలేదని భూలచ్చుమమ్మే ముందుబడి ఓ ఐదారు కుటుంబాల దగ్గర కొంచెం కొంచెం అప్పు తీసుకోని  అంగడికి బోయి రొండు మంచి ఎడ్లను కొన్నది. రొండెకరాల భూమిల బావి తవ్విచ్చింది. ఒక ఆయిల్ ఇంజన్ కొన్నది. వడ్లాయనకు కొన్ని పైసలిచ్చి ఒక ఎడ్లబండి చేయించింది. నాగలి, గొర్రు, గుంటుక, దంతె పాతయే వుండె. అవి కొంచం కూశయ్ నయ్. వాటిని మంచిగ సైజేపిచ్చి వ్యవసాయం మొదలుబెట్టింది. నర్సయ్య శానా నిమ్మలం మనిషి. భార్యకు శెప్పుకుంట ఇటు పుల్ల అటు పెట్టడు. ఎంగిలి చెయ్యితోని కాకిని కొట్టడు. శెప్పింది శెప్పినట్టు శేత్తడు.

నీళ్లకు కరువు లేకపోవుడుతోని వున్న రెండెకరాలల్ల కూరగాయలు, ఆకుకూరలు పండిచ్చి ఎడ్లబండి కట్టుకోని వరంగల్లు మార్కెట్టుకుబోయి అమ్ముకోని వచ్చెటోళ్ళు. మూడు నాలుగు సంవత్సరాలు కడుపుగట్టుకోని అలుమొగలు కష్టపడేసరికి సంసారం కొంచెం పచ్చబడ్డది. నాలుగు రాళ్లు ఎనుకేసి జెర శెయ్యి తిప్పుకోని అప్పులు, ఆటి మిత్తీలు తీర్చింది. మిగిలిన పైసలతోని ఓ ఐదు మంచి పాలిచ్చె బర్రెలను కొన్నది.

ఊరు అఖరి నిద్రలుండంగనె భూలచ్చుమమ్మ నిద్రలేశి బర్లపాలు పిండి, ఊళ్ళె వాడికలు పోశేది. వరంగల్లుల కొన్ని పెద్ద పెద్ద హోటల్లల వాడికలు పట్టి నర్సయ్యను పంపిచ్చి పాలు పోశేది. మిగిలిన పాలు తోడేశి పెరుగు జేషి గంపల బెట్టుకోని ఊళ్ళె తిరిగి అమ్మేది. నెల తిరిగేటాలకు కంటికి పైసలు శానా కనిపిచ్చేవి. పైసలు సూత్తాంటే భూలచ్చుమమ్మకు ఇంకా ఆసవ్వున బాగ పెరిగింది. అట్ల పైసలు కూడేశి చిన్నగ భూములు కొనుడు సురువు జేశింది. ఎకరం, రెండెకరాలు, మూడెకరాలు కొనుక్కుంట పోతానే వున్నది: ఈలోపు కొడుకులు చేతికందచ్చి కొంచెం ఆసర అయ్యెటాలకు సంసారం శానా దువ్వడిగా ఎదుగింది.

కొత్తగ కొన్న భూములల్ల పత్తి, మిర్చి, వరి, శెనిక్కాయ అసొంటి వ్యాపార పంటలు పండిచ్చి మంచి లాభాలను కండ్లజూశింది. భూములమీద అంజుమన్ లోన్లు తీసుకునేది. మళ్ళా ఆ లోన్లు కట్టేది బ్యాంకోల్ల దగ్గర భూలచ్చుమమ్మకు మంచి పేరుండె. అప్పటికే 22 ఎకరాలు భూమిని కొన్నది. పాత రెండెకరాల భూమితోని కలిపి మొత్తం ఇరవై నాలుగు ఎకరాల భూమిని పోగు జేషింది.

సంసారం బందబస్తుగా నిలదొక్కుకున్నంక పెద్ద కొడుకుకు పెండ్లి జేషింది. తర్వాత ఆరు నెల్లకు రెండోగోనికి .. అట్ల ఐదుగురు కొడుకుల పెండ్లి జేషింది. బిడ్డ రేణుకమ్మకు కూడా హన్మకొండల ఓ సర్కారు బడి పంతులు సంబంధం జూసి రెండెకరాలు అమ్మి పెట్టుపోతలు పెట్టి మిగిలిన పైసలు కట్నం కింద ఇచ్చి దూందాంగ పెండ్లి జేసి అత్తగారింటికి సాగనంపింది.

ఐదుగురు కొడుకులకు సర్కారు నౌకర్లయినయ్. ఇద్దరికి RTC, ఒగాయనకు మండలం ఆఫీసుల, ఇంకిద్దరు బడిపంతుళ్లు. ఉద్యోగాలు మంచిగనె వున్నయ్ కని ఇంటింటికి మంటిపొయ్యి తప్పకుంటాంటె పెంకాసులె ఎల్లయ్ అన్నట్టు ఇంట్ల కోడండ్ల మధ్యల లొల్లులు పెరిగినయ్. లేగలు లేగలు కొట్లాడుకోని ఆవుల మీద పడ్డట్టు పెండ్లాలు లొల్లులు పెట్టుకోని మొగళ్ళకు పిర్యాదులు జేసుకుంటె మొగండ్ల మధ్యల పెద్దపెద్ద యుద్ధం పట్టు సురువయ్ రొండుమూడు సార్ల గల్లలు గల్లలు పట్టుకోని తన్నుకున్నరు. కన్నకొడుకులు కండ్లముందట తన్నుకునేసరికి భూలచ్చుమమ్మ గుండె పగిలింది.

ఇట్లయితె కుదురదని ఐదుగురికి ఏరుబోషింది. తలా నాలుగు ఎకరాల భూమి పంచిచ్చి ఓ రెండెకరాల భూమిని అలుమొగల బతుకుదెరువుకు పక్కకు బెట్టుకున్నది.

కొడుకులకు ఏరుబోషినంక ఓ రోజు రాత్రి ఇద్దరాలు మొగలు బువ్వ తింటాంటె పెనిమిటి నర్సయ్యతోని అయ్యా మనకు ఒంటిమీదికి డెబ్బై ఏండ్లుదాటచ్చినయ్ కని బతుకులల్ల ఒక్కరోజన్న నిమ్మలం లేదాయె. అప్పులు తెచ్చుడు అవి తీర్చుడు. భూములు కొనుడు దాంట్ల పంటలు పండిచ్చుడే సరిపోయింది. మా అంటె ఇంకో పది ఇరవై ఏండ్లు బతుకుతం కావచ్చు. బతికినన్ని దినాలు వున్న రెండెకరాలు మునాఫకు ఇచ్చుకోని వచ్చింది తినుకుంట కూసుందాం అన్నది. నర్సయ్య సంబురంగా సరే అన్నడు. ఓ ఆసామికి రొండెకరాల భూమిని మునాఫకిచ్చి వచ్చిన పైసలు దాసుకోని తినుకుంట జెర నిమ్మలంగ బతుకుతాండ్లు.

ఆడపెత్తనం తంబలి దొరతనం అని ఎవ్వడన్నడోగని వాళ్లే వంగబెట్టి ముడ్డిమీద తన్నాలె . దేశాన్ని ఏలిన ఇందిరాగాంది కంటె ఐగురం మంతురాలు భూలచ్చుమమ్మ. ఐదుగురు కొడుకులను, బిడ్డను రెక్కల కష్టం మీద ఓ రేవున పడేసింది. ఇగ ఇంటి ముందట వాకిట్ల నులక మంచమేసుకోని కూసోని వచ్చిపోయెటోళ్లకు జిందగిల పడ్డ కష్టమంతా శెప్పుకుంట కూసునేది. అట్ల కొంతకాలం గడిసినంక ఓ రోజు భూలచ్చుమమ్మకు మూత్రం బందయ్యి  పొత్తికడుపు ఉబ్బింది. అప్పటికే ఓ రొండుమూడు నెలలనుంచి మూత్రం సాఫుగ వత్తలేదట. కొడుకులకు చెప్పినా ఎవ్వడు పట్టించుకుంటలేడు. ఎవ్వని లొల్లి వాంది. మొత్తమే మూత్రం బందయ్యెటాలకు హైదరాబాదుకు తీస్కపోతే అన్ని పరీక్షలు జేసి రొండు కిడ్నీలు కరాబయ్యినయి మార్చాలె. లేకపోతె బతుకుడు కష్టమే అని డాక్టర్ జెప్పిండు. కిడ్నీలు మార్చాలంటె లక్షలు ఖర్చయితయ్, ఇప్పటికి మందులు రాస్తానా ఇవి వాడుండ్లి. కొన్ని రోజులదాక ఎసొంటి ఇబ్బంది వుండది. డబ్బులు తయారుజేసుకోని రండ్లి. తతిమ్మ విషయాలు నేను జూసుకుంట అని డిస్చార్జ్ జేషిండు.

నా తలరాత రాసిన భగమంతుని మీద నాలుగు దోశెల్ల మన్ను బొయ్య ఎట్ల రాశిండు సూడు. నాకు పెండ్లయిన పద్నాలుగో ఏటి నుంచెల్లి కష్టమేనాయె జెర ఇప్పుడే నిమ్మలపడ్డ ఇంతల్లనే ఈ రోగం

**నా తలరాత రాసిన భగమంతుని మీద నాలుగు దోశెల్ల మన్నుబొయ్య ఎట్ల రాశిండు సూడు. నాకు పెండ్లయిన పద్నాలుగో ఏటి నుంచెల్లి కష్టమేనాయె జెర ఇప్పుడే నిమ్మలపడ్డ, ఇంతల్లనే ఈ రోగం రావాల్న అని ఒకటే ఏడుసుడు.**

రావాల్న అని ఒకటే ఏడుసుడు. కని బతికాల్నని మనసుల ఆశ, కోరిక బలంగ వున్నది భూలచ్చుమమ్మకు.

ఆపరేసనుకు లక్షలు ఖర్చయితయ్ ఎట్లా కొడుకులు సూడబోతె పంచిచ్చిన తలా నాలుగు ఎకరాలు కొడుకుల సదువులకని బిడ్డల పెండ్లి ళ్ళకని అమ్ముకున్నరు. ఏమన్న ఇత్తె తిందామని నాకే ఎదురు సూత్తాండ్లు. నా పాణమే పోయినంక భూమి వుంటెంత పోతెంతా అని ఇసారిచ్చుకొని వాళ్ళ బతుకుదెరువుకు పక్కకు బెట్టిన రొండొకరుల భూమిని అమ్మకానికి బెట్టింది. వరంగల్లు హంటర్ రోడ్డుకు దగ్గర్నే ఉంది ఆ రొండెకురాల భూమి. అక్కడ భూములు మస్తు పిరం పలుకుతుండె. అప్పుడు రియల్ ఎస్టేట్ బూం ఊపందుకున్న టైమ్. ఇంకా ఓ ఆరునె లలు, ఏడాది అయితె ఆ భూమికి కోట్లు పలుకుతయ్. ఆ భూమి మీద అప్పటికే ఐదుగురు కొడుకుల కన్నుబడ్డది. ఆ భూమిని అమ్ముడు కొడు కులకు అసలే ఇష్టం లేదు. అప్పటికే భూలచ్చుమమ్మ, నర్సయ్యలు రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు శెప్పిండ్లు ఎకరానికి 10 లక్షల సొప్పున 20 లక్షలు ఇచ్చెదానికి బేరం కుదిరింది. నోటి మాట ఖాయం జేసుకోని నర్సయ్య కొడుకులని పిలిశి భూమి అమ్ముతాన కాగితాల మీద సంత కాలు శెయ్యిండ్లి అంటె ఒక్కడత్తలేడు సంతకం పెడుతలేడు. కొనెటానికి వచ్చినోళ్ళను సాటుకు మాటుకు బెదిరిచ్చి పంపిస్తాండ్లు మా పాలుకు తీసిన భూమిని మేము అమ్ముకుంటానం. వద్దనెదానికి మీరె వర్రా..! మీరేమన్న కష్టం జేషి సంపాయిం చ్చిండ్రా, పంచిచ్చిన భూమిని కాపాడుకునె తెలువులు లేవుగని మా భూమికి ఎదురుసూ త్తాండ్ల అని ఇద్దరాలుమొగలు కొడుకులను నిలదీషిండ్లు. ఊళ్ళె పెద్ద మనుషులకు పిర్యాది జేషిండ్లు. మీ కుటుంబం విషయాలల్ల మేమెట్ల తలదూర్సం అని అందరు మొఖం సాటేషిండ్లు.

**ఓ రోజు** ఎర్రటి ఎండల ఆటో మాట్లా డ్కొని మిల్సుకాలని పోలీస్ స్టేషన్‌కు బోయి S.I. ముందు గోడంత ఎళ్లబోసుకున్నది. S.I. శానా మంచోడు. కొడుకులను పిలిపిచ్చి నచ్చజెప్పి సంతకాలు పెట్టించే ఉపాయం జేషిండు. అయినా వాళ్లు ఇనలే . ఇగ S.I. ఏం జెయ్యలేక అమ్మా ఇది సివిల్ ముచ్చట. దీంట్లె నేను ఇంతకన్న ఎక్కువ కల్పించుకుంటె మంచిగుండది అని శేతులెత్తేషిండు. తెల్లారి ఊళ్ళె సర్పంచికి జమానత్ ఇచ్చి నాలుగు బాటల్లకు కొడుకులని పిలిపిచ్చింది. సర్పంచి ఇద్దరి వాద నలు ఇని మీ అవ్వ ఆపరేషనుకు అయ్యే ఖర్సులన్న పెట్టుకోండ్లి లేకపోతె వాళ్ల ఇస్తుకు తీసిన ఆ రొండెకరాలు అమ్ముకోనియ్యిండ్లి మీరు సంత కాలు పెట్టుండ్లి అని తీర్పు జేషిండు సర్పంచి. దానికి ఎంటనే కొడుకులు మా దగ్గిర పైసల్ లెవ్వు ఇంకో ఏడాది అయితే ఆ భూమికి కోట్లు పలు కుతయ్ అగ్గనగాండ్ల అడ్డికి పావుశేరు అమ్ముడేంది అని సర్పంచిమీదికి కొండుకులు కోడండ్లు ఎగబడ్డరు. మరి ఇంకో యాడాది దాక ముసల్ది బతుకది గదా సత్తెమాయెనా అని సర్పంచి గరమయ్యిండు. ఎంటనే కోడండ్లు గయ్యిన లేశిసత్తె సావనియ్ తియ్ ఆ మాయదారి రోగం మేం తెచ్చుకోమన్నమా. ఇప్పుడామె బతికి రాజ్యాలు గెలిచేదున్నదా, రాజ్యాలు ఏలేదున్నదా అని సర్పంచి తీర్పును గూడా తీశిపారేశిండ్లు. కొడుకుల సంతకాలు లేకపోతే కొనుడు కుదరదని ఆ కాగితాలు చెల్లవని చట్టంల అట్లున్నదని కొనడానికి వచ్చిన ఇంకో బ్యారగాడు గూడా నప్పు డుజేక ఎళ్లిపోయిండు. కోపం ఆపుకోలేక కొడుకుల మీద, కోడండ్ల మీద బజాట్ల దుబ్బ ఎత్తి పోషింది భూలచ్చుమమ్మ. పొద్దంత తిండిలేదు వంటలేదు . రాత్రి ఎనిమిది గంటలకు ఇన్నన్ని బియ్యం బెట్టవే ఆకల యితాంది అని నర్సయ్య అనెటాలకు ఓ గిద్దెడు బియ్యంబెట్టి నాలుగు పచ్చిమిరపకాయలు గొలిచ్చి, పావుకిలన్ని రాంములక్కాయలు ఉడుక బెట్టి రోట్లేశి తమాట తొక్కు నూరింది. ఇద్దరాలుమొగలు కూసోని బువ్వ


భూలచ్చుమమ్మ బువ్వ కలు పుకుంట ఏదో ఆలోసి త్తాంది. సత్తె సావనియ్. మేము తెచ్చుకోమన్నమా ఆ మాయదారి రోగం. ఇప్పు డామె బతికి రాజ్యాలు గెలిచేదున్నదా, రాజ్యాలు ఏలేదున్నదా అని కొడు కులు కోడండ్లు అన్న మాటలే యాదికత్తాన్నయ్.


ఏసుకొని తింటాండ్లు. నర్సయ్య ఆకలి మంట మీద దనదనా తింటాండు. భూలచ్చుమమ్మ బువ్వ కలుపుకుంట ఏదో ఆలోసిత్తాంది. సత్తె సావనియ్. మేము తెచ్చుకోమన్నమా ఆ మాయదారి రోగం. ఇప్పు డామె బతికి రాజ్యాలు గెలిచేదున్నదా, రాజ్యాలు ఏలేదున్నదా అని కొడుకులు కోడండ్లు అన్న మాటలే యాదికత్తాన్నయ్. కండ్లల్లకెళ్ళి నీళ్ళా వడిశి బువ్వ పల్లెంల పడుతానయ్.

ఆ దినమంతా భూలచ్చుమమ్మ కంటి తడి ఆరుతలేదు. ఆమె కండ్లు శిమ్మటిచ్చి మంచి నీళ్ల పటువలైనయ్. వాటి చట్టం మీద మన్నుబొయ్య. కన్నతల్లిని సంపమని శెప్పిండా అని బువ్వ తినకుంటనే గోలెం కాడ పల్లెం పారేశి శెయ్యి కడుక్కోని ఇంట్లకు బొయ్యి తలుపులేసుకోని పండు కున్నది. వాకింట్ల గండంచా వాల్చుకోని నర్సయ్య పండుకున్నడు. తెల్లంగ తెల్లారుతాంది రాత్రి కొంచెం ఆలిసెంగ పండుకొనెటాలకు నర్స య్యకు తెలివి రాలే. ఎండపొడ తగిలేసరికి లేశి కండ్లు తుడుసుకోని అటు ఇటు సూశి అరె ఈ ముసల్ది పొద్దుగాల వాకిలి ఊడువలే. ఆలుకు సల్లలె ఏంది అని లేశిపోయి తలుపు గొట్టిండు. తలుపు ఎంతకు తియ్యకపో యేసరికి ఇంటిపక్కోళ్ళను, ఇంటిముందోళ్ళను పిలుస్తే అందరచ్చి తలు పులు ఊడదీకి లోపలికి బోయేసరికి పెద్దగు దూలానికి పగ్గంతోని ఉరే సుకోని జీవిడిశి శవమై యాల్లాడుతాంది నడిశే నల్లపోచమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లసొంటి భూలచ్చుమమ్మ.

ఈ సంగతి ఆనోటా ఈ నోటా ఊళ్ళె తెలి సేసరికి కొడుకులు, కోడండ్లు, మనుమలు, మనుమరాండ్లు ఉరికచ్చి శవాన్ని దించి ఇంతంత వరిగడ్డి పరిశి దానిమీద ఓ పాత బొంత పరిశి పీనిగను పండుకోబెట్టిండ్లు. ఏడి షిండ్లు, తూడిషిండ్లు. దింపుడుగల్లంకాడికి పోంగనె పాడెను దించి ఒంటిమీదున్న బంగారు, వెండి సొమ్ములన్నీ ఒలుసుకున్నరు. దహనం జేషి నీళ్ల మునిగి వచ్చిండ్లు. మూడో రోజు పిట్టకుబెట్టిండ్లు. తొమ్మిదోరోజు కార్యం బిడ్డ రేణుకమ్మ జేషింది. ఇగ అసలైన కార్యం పదకొండొద్దుల దినాల కార్యం రానే వచ్చింది.

ఐదుగురు కొడుకులు ఓ అర్రల కూసోని అవ్వయి బంగారు పుస్తెల తాడు, గంటీలు, వెండి కాల్లు, శేతుల కడియాలు సొమ్ములన్నీ అమ్మితే ఎటు లేదన్నా ఓ రొండు లక్షలదాక వత్తయ్. ఆ పైసలతోని ఓ ఇరవై యాటపోతుల తీసుకుందాం. ఓ పది కింటాల్ల భగార బువ్వ ఏద్దాం. ఇంత దాల్చ జేద్దాం. దినాల కార్యం ఎల్ల దీద్దాం. ఆ రొండెకరాల భూమి అట్ల వుంచుదాం. ఓ యాడాది అయితే దానికి కోట్లు పలుకుతయ్ అని ఇసారిచ్చుకోని ఎటోళ్ళు అటు లేశి పోయిండ్లు. భూలచ్చుమమ్మ దినాల తెల్లారి శెయ్యి సంచిల పాత బట్టలు, సదురుకోని కొడుకులతోని వుండలేక పుట్టిన ఊరు ఇడిషిబెట్టి గొడగొడ ఏడుసుకుంట బిడ్డ రేణుకమ్మతోని నర్సయ్య ఎళ్లిపోయిండు.

**భూలచ్చుమమ్మ** ఇంటి సాయబాన్ల చిలుక్కొయ్యకు యాల్లాడదీ శిన పాత డొక్కు పిలిప్స్ రేడియోల ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రంల

పదిమాసాలు మోసావు పిల్లలను
బ్రతుకంతా మోసావు బాధలను
ఇన్ని మోసిన నిన్ను మోసేవాళ్లు లేక వెతకుతున్నావు.
ఈ జీవన తరంగాలలో, ఆ దేవుని చదరంగంలో
ఎవరికి ఎవరు సొంతము, ఎంతవరకే బంధము
అని జీవనతరంగాలు సినిమాల పాటవస్తాంది.

-


రచయిత చిరునామా: ఇం.నెం: 8-3-167/3/151/ 156, శ్రీ సాయి శ్రీనివాస్ టవర్స్, బ్లాక్ - 2, ఫ్లాట్ నం: 301, కళ్యాణ్ నగర్ వెంచర్-3, మోతీనగర్, హైదరాబాద్-18. మొబైల్: 78374 97065